రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు సన్మానం

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 8: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి ఘనవిజయం సాధించడంపై రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు చింతపల్లి శ్రీనివాస్ శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను శాలువాతో సన్మానించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సంకూరి జయప్రకాశ్ పాల్గొన్నారు.

అన్నదానం

సికింద్రాబాద్, జూన్ 8: వారాసిగూడ సాయిఅమ్ములు ఆసుపత్రి ఎదుట శనివారం పేదలకు అన్నదానం చేశారు. దవాఖాన నిర్వాహకురాలు డాక్టర్ మృణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బీఆర్ఎస్ పాలనలోనే పేదల సంక్షేమం

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్
- యూసుఫ్‌గూడ, షేక్‌పేట్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

జూబ్లీహిల్స్,జూన్ 8 : పేదల సంక్షేమమే పరమావధిగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేసిందని ఆ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అన్నారు. శనివారం యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరి కూడలిలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్‌తో కలిసి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటగిరి, శ్రీకృష్ణా నగర్ బీ, సీ బ్లాక్‌లకు చెందిన 13 మంది లబ్ధిదారులకు రూ.13,01,508 విలువైన చెక్కులను అందజేసి మట్లాడారు. కార్యక్రమంలో షేక్‌పేట్ మండల అధికారులు ధీరజ్, భీమ్‌సింగ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్‌ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌దాస్, నాయకులు కైసర్ జహాన్, గీతాగౌడ్, మాధవి, అమ్మాజి, అరుణ, అశోక్, ప్రసన్న, నాగరాజు, రవి, చిన్న, శరత్, నవీన్ పటేల్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్

షేక్‌పేట్‌లో లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్

షేక్‌పేట్‌లో..

షేక్‌పేట్ : ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నామని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అన్నారు. శనివారం షేక్‌పేట్‌లో 60 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

వరదనీటి ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

- జలమండలి జీఎం హరిశంకర్

ఎల్లారెడ్డిగూడ సెక్షన్ పరిధిలో సేఫ్టీగ్రిల్స్ పనులను పరిశీలిస్తున్న జలమండలి జీఎం హరిశంకర్

జూబ్లీహిల్స్, జూన్ 8 : వరద నీటి ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. ఆయా లొకేషన్లలో సేఫ్టీగ్రిల్స్ అమర్చడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని జలమండలి జీఎం హరిశంకర్ సిబ్బంది ఆదేశించారు. శనివారం ఎల్లారెడ్డిగూడ సెక్షన్ పరిధిలో చేపడుతున్న సేఫ్టీగ్రిల్స్ పనులను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. వరద ప్రవాహం నిలిచే ప్రాంతాల్లో 1200 డీప్ మ్యాన్‌హోల్స్‌ను గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన పూడికతీత పనులు చేపడుతున్నామని, అంతేకాకుండా మ్యాన్‌హోల్స్ లోపల పటిష్టమైన ఐరన్ గ్రిల్స్ ఏర్పాటుచేసి వాటిపై మూతలు అమర్చనున్నట్లు తెలిపారు. అయితే వరద ప్రభావంతో అవి కనబడక ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రంఫెట్ ఫెస్టివల్ ఫెలోషిప్ ర్యాలీ

మారేడ్‌పల్లి, జూన్ 8: సికింద్రాబాద్ వెస్లీ చర్చిలో ట్రంఫెట్ ఫెస్టివల్ ర్యాలీని మాజీ డీజీపీ స్వరణ్‌జిత్ సేన్ జెండాను ఊపి ప్రారంభించారు. శనివారం ఉదయం ర్యాలీ.. క్లాక్‌టవర్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వరకు వెళ్లి తిరిగి చర్చికి చేరుకున్నది. వందలాది మంది క్రైస్తవులు ప్లకార్డులు పట్టుకుని ఏసు క్రీస్తు పాటలు పాడుతూ క్రీస్తు రెండో రాకడపై అవగాహన కల్పించారు. అంతకుముందు చర్చి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో స్వరణ్‌జిత్ సేన్, ప్రీ మెథడిస్ట్ చర్చి ఆఫ్ ఇండియా బిషప్ జాన్ గొల్లపల్లి ఏసు క్రీస్తు రెండో రాకడ గురించి వివరించారు. లోకంలో పాపులను రక్షించేందుకు ఏసుక్రీస్తు మరోమారు ఈ లోకానికి రాబోతున్నాడని బైబిల్‌లో స్పష్టంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఫెలోషిప్ సెల్విన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, చార్లెస్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో మెరుగైన ఆరోగ్యం

మైలార్‌దేవ్‌పల్లిలో జీవీపీ ఎలిమినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్, అధికారులు, సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 8: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ వెల్లడించారు. వందశాతం జీవీపీల ఎలిమినేషన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని జీవీపీల వద్ద పారిశుధ్య కార్మికులు ముగ్గులు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇండ్లల్లోని చెత్తను రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో వేయవద్దన్నారు.ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోల్లో వేయాలని సూచించారు. రోడ్లపై ఎవరైనా చెత్త వేస్తే రూ. 500 జరిమానా విధిస్తామన్నారు. ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకోని జీవీపీ పాయింట్లను పూర్తిగా ఎలిమినేట్ చేస్తున్నామన్నారు. ప్రజలు గమనించి చెత్తను స్వచ్ఛ ఆటో కార్మికులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసులు, ఎస్ఎస్ సమేశ్, హెచ్ఐఎంఎస్‌డబ్ల్యూ సర్కిల్ ఇన్‌చార్జి నర్సింహారెడ్డి, ఎస్ఎఫ్ఏలు సంగీత, జగన్, మహేందర్, జాషువా, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షా కేంద్రంలో ఏర్పాట్ల పరిశీలన

రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రూప్-1 పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

బండ్లగూడ,జూన్ 8 : రాష్ట్రంలో గ్రూప్-1 పరీక్షలు అదివారం జరగనున్నాయి. రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రూప్-1 పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శనివారం రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు పరీక్షా కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎర్ర అంజయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. నిబంధనల మేరకు అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందుగానే రావాలని ప్రిన్సిపాల్ అంజయ్య సూచించారు.

యువత క్రీడల్లో రాణించాలి

నర్కూడలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు నీరటి రాజుముదిరాజ్, తదితరులు

శంషాబాద్ రూరల్, జూన్ 8 : యువత క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు నీరటి రాజుముదిరాజ్ అన్నారు. శనివారం శంషాబాద్ మండలం నర్కూడ గ్రామంలో నర్కూడ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లోని యువత క్రీడల్లో రాణించి రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ప్రతి యేటా యువకులను ప్రోత్సహించేందుకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మల్కారం పీఏసీఎస్ చైర్మన్ సతీశ్, డైరక్టర్ శివాజీ, నాయకులు శ్రీనివాస్, గుండాల విశ్వనాథంతో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్ల ఆక్రమణలపై అధికారులకు ఫిర్యాదు

జూబ్లీహిల్స్, జూన్ 8 : రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎస్పీఆర్ హిల్స్‌లోని ఎన్ఎస్‌బీ నగర్‌లో ప్రమాదవశాత్తు కూల్‌డ్రింక్స్ తరలించే వాహనం బోల్తా పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో డ్రైవర్ సమయస్ఫూర్తితో పెనుప్రమాదం తప్పిందని.. అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఉన్న ఎస్పీఆర్ హిల్స్ రోడ్డును ఆక్రమణలకు గురికాకుండా కాపాడాల్సిన అవసరం ఉందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఇరుకుగా ఉన్న ఈ రోడ్లపై ఆక్రమణలు పెరిగిపోతుండటంతో రోడ్లు మరింత కుదించుకుపోయి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. వాహనం బోల్తా పడటంతో జల మండలి పైప్‌లైన్ పగిలిపోయిందని.. తద్వారా తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు. రోడ్లపై ఆక్రమణలు తొలగించాల్సిందిగా యూసుఫ్‌గూడ టౌన్ ప్లానింగ్ ఏసీపీ రాణి, సర్కిల్ డీసీ సేవా ఇస్లావత్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జల మండలి పైప్‌లైన్‌లకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీఆర్ హిల్స్ సెక్షన్ మేనేజర్ రాజేందర్‌నాయక్‌కు సూచించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

విద్యుత్ కోతలతో అవస్థలు..

జూబ్లీహిల్స్, జూన్ 8 : యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్, వెంకటగిరి తదితర ప్రాంతాల్లో విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి కరెంట్ కోతలు లేవని,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పట్టపగలే కరెంటు పోయి చుక్కలు కనబడుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. శ్రీకృష్ణానగర్, వెంకటగిరి ప్రాంతాల్లో నిత్యం విద్యుత్ అంతరాయాలతో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

విఠల్‌వాడిలో పెండింగ్ పనులను పర్యవేక్షిస్తున్న హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్,జూన్ 8: పెండింగ్‌లో ఉన్న తాగునీటి, డ్రైనేజీ నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి జలమండలి అధికారులను కోరారు. శనివారం విఠల్‌వాడిలో పర్యటించి తాగునీటి,డ్రైనేజీ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. పనులు ఆలస్యం అవుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్పొరేటర్ వెంట కాంగ్రెస్ నేత రామన్ గౌడ్, స్థానికులు నవీన్, సత్య నారాయణ లాల్, సుజాత, తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

మాదాపూర్, జూన్ 8: కళాకారులు నృత్య ప్రదర్శనలతో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని అన్నమాచార్య బావనా వాహిని అధ్యక్షురాలు, పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సంస్కృతి ఆర్ట్ అకాడమీ గురువు తిరుగొప్పుల శ్వేత శిష్య బృందంచే సిరుల నవ్వులవాడు, అందరికీ అభయంభు, బ్రహ్మమొక్కటే అనే సంకీర్తనలకు దృతి,భవిష్య, నయని, హసిని, సాయి సమన్వితి, సమీర, అన్విత సంయుక్తంగా కలిసి అన్నమయ్య కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేస్తు శ్రోతలను ఆకట్టుకున్నారు. అనంతరం సంస్థ అధ్యక్షులు, డాక్టర్ శోభరాజు కళాకారులను శాలువా కప్పి జ్ఞాపికలతో సత్కరించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేషన్ బియ్యం తరలిస్తే పీడీ యాక్టు

కందుకూరు, జూన్ 8 : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ నాయబ్ తాసీల్దార్ రఘునందన్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని వివిధ రేషన్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రేషన్ దుకాణాలు ప్రారంభం కాగానే కొందరు ఆటోల్లో వచ్చి గ్రామాల్లో లబ్ధిదారుల వద్ద బియ్యం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలిస్తున్నారని చెప్పారు. ఆటోలు, దళారులపై నిఘా ఉంచి అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకొని పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపుతామని ఆయన హెచ్చరించారు.

ఈటలకు సన్మానం

సికింద్రాబాద్, జూన్ 8 : మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్‌ను పలువురు నాయకులు శనివారం సత్కరించారు. మద్దెర్ల శ్యాం సుందర్, పూస రాజ్‌కుమార్ తదితరులు మేడ్చల్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దుర్గంధభరితం.. వ్యవసాయ వర్సిటీ పరిసరాలు

- ప్రహరీ కూల్చి ఆక్రమణలకు పాల్పడుతున్నా పట్టించుకోని యూనివర్సిటీ అధికారులు

యూనివర్సిటీ స్థలంలో జీహెచ్ఎంసీ బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ పేరుకుపోయిన చెత్త

వ్యవసాయ యూనివర్సిటీ,జూన్ 8 : వ్యవసాయ విశ్వవిద్యాయలం స్థలాలు చెత్తకుప్పలకు నిలయంగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. అయినప్పటికీ జీహెచ్ఎం పారిశుధ్య విభాగం తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నది. రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాయానికి చెందిన దాదాపు 2 వేల ఎకరాల్లో చుట్టూ స్థానికులు చెత్త వేస్తుండటంతో దుర్గంధం వ్యాప్తి చెందుతున్నది. బుద్వేల్, రాజేంద్రనగర్, డైరీఫామ్, నేషనల్ ఫిషరీస్ అకాడమీ, విజయ ఆయిల్ స్టేషన్ సమీపంలో నేరుగా ప్రహరీ గోడ కూల్చి ప్రజలు చెత్తా చెదారం పడేస్తున్నారు. అంతేకాకుండా వీధి కుక్కలు చనిపోతే వాటిని వర్సిటీ స్థలాల్లో పడవేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి కళేబరాలు కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్నది. దాంతో క్యాంపస్‌లో ఉంటున్న విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. ఈవిషయమై ప్రశ్నించడంతో సెక్యూరిటీ సిబ్బందిని కొంద రు బెదిరిస్తున్నట్లు తెలిసింది. ఇక్కడి స్థలాలకు భారీగా డిమాండ్ ఉన్నందున ముందుగా ప్రహారీ కూల్చి, చెత్తా చెదారం వేసి ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. విజయ ఆయిల్ ఫిల్లింగ్‌స్టేషన్ సమీపంలో కుంటను స్థానిక నేతల సహకారంతో ఆక్రమిస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

ఎన్‌హెచ్ఎం కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు ఎం.నరసింహ

హిమాయత్‌నగర్, జూన్ 8: రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌హెచ్ఎం పథకం కింద రాష్ట్ర ప్రోగ్రామ్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ యూనిట్లలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను తక్షణమే పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో నరసింహ మాట్లాడుతూ కుటుంబ ఆరోగ్యశాఖలో 80 శాతం ఉద్యోగులు గత 16 ఏండ్లుగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో పనిచేస్తున్నారని, వారి సేవలను గుర్తించి ప్రభుత్వం పర్మినెంట్ చేయాలన్నారు. ఎన్‌హెచ్ఎంలో పని చేస్తున్న ఉద్యోగులకు రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్‌తో పాటు సాధారణ ఇన్సూరెన్స్ అమలు చేయాలని కోరారు. సమావేశంలో కరీంనగర్ డీపీఓ రవీందర్‌రెడ్డి, నాయకులు రామాంజనేయులు, స్వామి, సిద్ధార్థ, సంతోష్, విశాలరాణి, దుర్గా, నర్సయ్య, విద్యాసాగర్, నాగరాజు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, జూన్ 8 : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించిన ప్రదర్శనల్లో పలువురు నృత్యకారులు సంప్రదాయ నృత్యరీతులతో అలరించారు. ప్రదర్శనల్లో మయూరి నృత్యాలయాల గురువులు శ్రీదేవి రాజనాల శిష్య బృందం నర్తించిన కూచిపూడి నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాకారులు భామ ప్రవేశం, రుక్మిణి ప్రవేశం, కొలువైతి వరంగశాయి, గణేశా పంచరత్న, అతినిరుపమా తదితర అంశాలను కూచిపూడి నృత్యరూపకంలో నర్తించి ఆకట్టుకున్నారు.

కంప్యూటర్‌పై ప్రోగ్రామింగ్ చేస్తున్న విద్యార్థులు

లార్డ్స్ కళాశాలలో హ్యాక్‌ప్రిక్స్ ప్రారంభం

బండ్లగూడ,జూన్ 8 : హిమయాత్‌సాగర్ లార్డ్స్ కళాశాలలో హ్యాక్‌ప్రిక్స్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. జాతీయ స్థాయిలో మొదటి సారిగా 36 గంటలపాటు విద్యార్థులు కంప్యూటర్ ప్రోగ్రామ్‌లను రూపొందించాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. హ్యాక్‌ప్రిక్స్ కార్యక్రమంలో దేశంలోని 80 నగరాల నుంచి 550 మంది విద్యార్థులు పాల్గొనన్నుట్లు తెలిపారు. అదివారం సాయంత్రం ఈ కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు లక్షా 20 వేల రూపాయల వరకు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

చెక్కుల పంపిణీ

బంజారాహిల్స్, జూన్ 8 : బంజారాహిల్స్ డివిజన్‌లో 39 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంజూరయ్యాయి. శనివారం ఆ చెక్కులను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డికి డాక్టరేట్

మణికొండ, జూన్ 8: మణికొండ ప్రాంతానికి చెందిన పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి డాక్టరేట్ పొందారు. గత అనేక సంవత్సరాలుగా స్విమ్మింగ్ క్రీడలో ఆయన చేస్తున్న సేవలను గుర్తించి అమెరికన్ డస్ప్రెంగ్ క్రిస్టెన్ యూనివర్సిటీ వారు చంద్రశేఖర్‌రెడ్డికి డాక్టరేట్ అందజేశారు. జీజీపీపీ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రభుకిరణ్, ఉమెన్ ప్రెసిడెంట్ టి.సునీత, రెవరెండ్ ప్రొఫెసర్ రాజాజీ ప్రసాద్, మాస్టర్స్ స్విమ్మర్ డాక్టర్ క్వీన్ విక్టోరియా చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ పొందారు. ఆరోగ్యవంతమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ తప్పకుండా స్విమ్మింగ్ చేయాలని చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు.

మ్యాన్‌హోల్స్‌లో వ్యర్థాల తొలగింపు

బంజారాహిల్స్, జూన్ 8 : జూబ్లీహిల్స్‌లో ప్రధాన రహదారిపై వర్షాలు కురిసినప్పడల్లా భారీగా వరదనీరు చేరుతున్నది. ఫలితంగా ట్రాఫిక్ జామ్ అవుతూ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి వరద నీరు ముంపునకు కారణమవుతున్న మ్యాన్స్‌హోల్స్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుధ్య సిబ్బందితో తొలగింపజేశారు.